# అగుపించని అదృష్టం

-శ్రీపతి బాలసరస్వతి

'అవ్వ!... పుట్టి బుద్ధెరిగి ఇన్నేళ్ళయింది. ఇలాంటి విడ్డూరం ఎప్పుడూ కనలేదమ్మా.. ఎప్పుడూ విన లేదయ్యా.. కానీ.. కానీ స్వయంగా చవి చూస్తున్నా నర్రేయ్' స్వగతంగా అరుచుకున్నాను ఒకటోసారి, రెండోసారి, కోటోసారి. ఎందుకంటే బిగ్గరగా అరిచినా అది అరణ్యరోదనమే. గోడకి వేసిన బంతే. పోనీ బాధని ఒకరికి చెప్పుకుంటే మనస్తాపం తగ్గుతుందంటారు కదాని ఎవరికన్నా చెప్పుకుందామంటే, ఇంట్లో పని మొదలు పెట్టాకే సూర్యోదయం బయట అవుతుంది. సూర్యాస్తమయం అయ్యాకే పని ముగుస్తుంది. అలాంటప్పుడు ఎక్కడికని వెళ్ళనూ? ఎప్పుడని వెళ్ళనూ? ఎవరికని చెప్పనూ?.. నాన్నకి అమ్మకి ఫోన్ చేద్దామన్నా, ఉత్తరం రాద్దామన్నా ఇంట్లో ఫోన్ లేదు. ఫోన్ కోసం, ఉత్తరం కోసం వెళ్దామన్నా దగ్గరలో అలాంటి ఆకారాలు లేవు. ఊరి చివర ఇదొక అరణ్యవాసమాయె. ఆయనకి చెప్పాలని లేదు. ఎపుడన్నా అమ్మా, నాన్న, అత్తగారు, మామగారు ఉత్తరాలు రాస్తుంటారు. కాలేజికి ఫోన్ చేసి కుశలం అడుగుతుంటారు. మాటిమాటికీ వాళ్ళు రావడానికి కుదరదు కదా. పొలంపన్లు. పైగా ఇక్కడ తోచదు వాళ్ళకి. పోనీ అద్దంలో చూసుకుంటూ చెప్పుకుందామంటే పేద్ద భవనమనబడే ఆ చిన్న గదిలో బుల్లి అద్దం. దానిలో పూర్తిగా ముఖం కనిపిస్తే ఒట్టు. కాటుక పెట్టుకోవాలంటే అద్దాన్ని కళ్ళెదురుగా పెట్టుకోవాలి. బొట్టు పెట్టుకోవాలంటే నుదురుకి ఎదురుగా అద్దాన్ని పెట్టుకోవాలి. కింకర్తవ్యం?

అసలింతకీ సంగతేమిటంటే, మా వారిని నేను లక్ష్మి బొమ్మలు వున్న బంగారు దుద్దులు కొనిమ్మని అడిగాను.. పెళ్ళయి కొత్తగా కాపురానికి వస్తూంటే, రైల్లో ఒకావిడ దుద్దులు లక్ష్మి బొమ్మలతో ధగధగా మెరుస్తూండటం చూశాను. ఎంత బాగున్నాయో..! అసలు ఆ దుద్దులు ఎంత వుంటాయని?.. మహా అయితే వెయ్యి రూపాయలు వుంటాయేమో!.. ఆ మాత్రం దానికే ఏదో లక్షలు, కోట్లు, ఆస్తులు.. అడిగేస్తున్నంత హంగామా చేసేస్తున్నారు. ఇన్నేళ్ళుగా చిన్నపిల్లని మభ్యపెట్టినట్టుగా నన్ను ప్రతీ విషయంలోనూ మభ్యపెడుతూనే వస్తున్నారు.

పెళ్ళయిన కొత్త కదా అడక్కుండానే అన్నీ అమరుస్తారని ఆశపడ్డాను. లక్ష్మి దుద్దుల గురించి చెప్పగానే "చూడూ! మనది కొత్త కాపురం. నా జీతం మీదే అన్నీను. మామగారిని అడగను. నాన్నని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేదు నాకు. వంటింట్లో సామాన్లు ఏమేం కావాలో మొదట కొనుక్కుని.. తర్వాత..." చాలా నిదానంగా చెప్పారాయన. నేనేం మాట్లాడగలను ఇంక? ఆ సామాను అప్పుడు కొన్నదీ లేదు. నేను విన్నదీ లేదు, కన్నదీ లేదు.

సంవత్సరం తిరక్కుండానే అబ్బాయిని కన్నాను. పురిటికి నన్ను మా వూరు పంపలేదు. "మీవాళ్ళకెందుకు డబ్బు ఖర్చు?" అన్నారు. మా వాళ్ళు వస్తామంటే కాదనలేదు. వాళ్ళు మూడు నెలలు, అత్తగారు మామగారు నెల రోజులు వున్నారు. నాకు చాలా రెస్టు ఇచ్చారు. ఆ రెస్టు చూస్తే జీవితాంతం పిల్లల్ని కంటూండాలనిపించింది.

పుత్రోత్సాహంతో నా కోరిక కాదనరు. అదే మంచి తరుణం అని నా కోరికని తాంబూలంలో పెట్టి మా వారి ముందుంచాను. భోజనం అయ్యాక తాంబూలం చక్కగా వేసేసుకున్నారు. "బుజ్జిగాడి పాలడబ్బా ఖర్చు మన రోజూ ఖర్చుల జాబితాలో చేరింది కదోయ్" అన్నారు నా స్వామి దినఖర్చుల జాబితా రాసిన తన పుస్తకం చూపిస్తూ. బుజ్జిగాడికి పాలడబ్బా ఎందుకండీ నేనున్నానుగా పాడి డబ్బాని అన్నాను ఉక్రోషంగా. బిడ్డడు పుట్టాడు అంటూ వాడి చదువు దగ్గర నుంచి ఉద్యోగం కోసం చేసే ఖర్చుల దాకా వెళ్ళిపోయి నా నోరు పెగలకుండా చేశారు.

మా బుజ్జిగాడిని బళ్ళో వేసే రోజుల్లో మా బుజ్జిపాప పుట్టింది. నట్టింట లక్ష్మి వెలసిందనే సంబరంలో నాకు లక్ష్మి దుద్దులు వచ్చి తీరుతాయని ధీమా. కానీ షరా మామూలే. 'ఒకరికి ఇద్దరు, ఇద్దరికి ముగ్గురు. ముగ్గురికి నలుగురమయ్యామా?' అంటూ ఆడపిల్లకి చేసే ఖర్చుల్లో పెళ్లి ఖర్చు కలిపి గీతాజ్ఞాన బోధ చేశారు. అరటి పండు వలిచి పండు వుంచేసి తొక్క ఇవ్వటం అంటే ఇదే.

ఇంక నేనేం చేయగలను?.. అయినా ఎన్ననుకుని ఏం లాభం? ఎవరి కర్మకి వారే కర్తలు. నా డిగ్రీ పరీక్షలవుతూనే నాన్నగారి చిన్ననాటి స్నేహితుని కొడుకు మా వూరికి, మా కాలేజీకి గెస్ట్ లెక్చరర్‌గా వచ్చాడు. మా ఇంట్లో నాలుగు రోజులు వున్నాడు. ఉండి వెళ్ళిపోవచ్చుగా? తన తల్లిదండ్రుల్ని పిలిపించటం, మా పెళ్ళి నిశ్చయించటం, ఏ ఆర్భాటాలూ లేకుండా గుళ్ళో పెళ్ళి జరగటం అన్నీ వారం రోజుల్లో జరిగిపోయాయి. అందరూ నా అదృష్టం అన్నారు. నా అభిప్రాయం గాని, నా ప్రమేయం గాని అవసరం లేదన్నమాట. ఇంకా చదువుకుందామని, ఆ తర్వాత ఉద్యోగం చేస్తూ చాలా ఆర్భాటంగా పెళ్ళి చేసుకోవాలని, అందరూ గొప్పగా చెప్పకోవాలని చాలా కలలు కన్నాను. అన్నీ కల్లలైపోయాయి. ఇచ్చి పుచ్చుకోవటాలు లేవు. వట్టి చేతుల్తో పంపలేక అమ్మ కారాలు, తీపి వస్తువులు, ఊరగాయలు, పొళ్ళు, పళ్ళు ఇచ్చి పంపింది. నాన్న కొంత డబ్బు ఇచ్చి బట్టలు, బంగారం, ఇద్దరినీ కొనుక్కోమని ఆయన్ని బ్రతిమిలాడారు. ఏ కళనున్నారో ఒప్పుకున్నారు. ఆ డబ్బు పుట్టబోయే పిల్లలకి అంటూ బ్యాంకులో వేశారు.

హైదరాబాదులో లెక్చరరు ఉద్యోగం అంటే, నాక్కూడా ఏ స్కూల్లోనో టీచరు ఉద్యోగం రాకపోతుందా అనుకున్నాను. సంబరపడ్డాను. నా సంబరమంతా ఒయాసిస్‌లా మిగిలిపోయింది. పర్మనెంటు పనిమనిషి, వంటమనిషినై పోయాను. ఊహకి కూడా అలాంటి ఊహ రాలేదు మరి.

పెళ్ళవగానే మా వూళ్ళో పల్లకీ ఊరేగింపు లేదనే కొరత లేకుండా, సిటీ అంతా రిక్షా ఊరేగింపు జరిగింది. ఊరి శివార్లలో ఒక పేద్ద పాతబడ్డ బంగళాలో ఒకే ఒక్క చిన్న గదిలో మా కాపురం. శ్రీకృష్ణ భగవానుడు, తన నోటిలో సమస్త జీవకోటినీ చూపించినట్టు, ఆ గది, తనలో ఇముడ్చుకున్న సామానులన్నిటినీ చూపించింది. ఒకపక్కన సత్తు వంటసామాను, కిరసనాయిలు స్టౌ, డబ్బా, వంట సరుకుల పొట్లాలు, బియ్యం సంచి, మరోపక్కన దిండు, దుప్పటి, చాప, ఇంకో పక్కన చీపురు, ప్లాస్టిక్ చేట, విరిగిపోయిన చెత్త బుట్ట, నాలుగో పక్కన ఒక పాత సూట్‌కేస్, హాండ్‌బాగ్, చేతి సంచి, పైన దండెం, దాని మీద ఒక పాంటు, రెండు షర్టులు... ఆనాడు యశోదమ్మకిలాగే నాకు కళ్ళుతిరిగినట్టయింది అంతా చూశాక.

పిల్లడు స్కూల్‌కి వచ్చేంతవరకూ అదే సామ్రాజ్యం. హైస్కూల్లో పిల్లడిని, అదే చిన్న స్కూల్లో పిల్లని వేశారు. వేసవి సెలవుల్లో ఒక రోజు భోజనాల దగ్గర 'స్కూల్‌కి దగ్గరగా రెండు గదుల పోర్షన్ అద్దెకు తీసుకున్నానోయ్' అని ప్రకటించారు. "అద్దెకు గాక సొంతంగా కూడానా? నొక్కి నొక్కి పలికాను. "వూళ్ళోకి వెళ్ళి వుంటే చక్కగా పనివాళ్ళు, వంటవాళ్ళు దొరుకుతారు హాయిగా" అన్నాను హాయిగా ఊపిరి పీలుస్తూ. "అలాగా!.. అయితే ఇక్కడే వుందాంలే. పిల్లలకి ఇంత దూరం నడక తప్పుతుందని, చదువుకోటానికి టైము వుంటుందని, పబ్లిక్ పరీక్షలు కదా.. అని ఆలోచించాను. సరేలే.. నడక అన్నిటికన్నా మంచి ఎక్సర్‌సైజ్" మెల్లగా అన్నారు. చాపకింద నీరు!... "సరే పదండి" అన్నాను కచ్చిగా ఒక్కొక్క అక్షరం వత్తి పలుకుతూ. సహధర్మచారిణిని కదా!.. అంతకంటె నాలోని తల్లి ప్రేమ నన్ను గెలుచుకుంది.

వేసవి సెలవుల్లో ఆ రెండు గదుల ఇంట్లోకి మారిపోయారు. కొంచెం ప్రమోషన్!... రిక్షా నుంచి ఆటోలో ఊరేగింపు! అప్పుడే పాత మంచం, టేబులు, రెండు కుర్చీలు కొన్నారు మావారు. నేను గబగబా బయటికి పరుగు తీశాను. "ఎక్కడికి ఆ పరుగు?" అనడిగారాయన నవ్వుతూ. "నేనెక్కడికి పోతాను?.. సూర్యుడు ఎటు ఉదయించాడా అని చూస్తున్నాను" అన్నాను వెటకారంగా.

ఆయన నావైపొకసారి చూసి సామాను సర్దటానికి వెళ్ళిపోయారు. దీని భావమేమి తిరుమలేశా!.. దున్నపోతు మీద వానపడ్డట్టే!!

ఆ తర్వాత నెలలో మెత్తని పరుపులు, దిళ్ళు, ఆపై నెలలో దుప్పట్లు, ట్యూబులైట్, టేబుల్ ఫాన్ వెలిశాయి. "ఇంటి వారితో చెప్పవోయ్" అన్నారాయన ఒకరోజున. "ఏమని..? సెకండ్ హాండ్ సామాను కొన్నాము. వచ్చి చూడమనా?'' అన్నాను వెటకారంగా. లైటు బిగించటానికి గోడకి మేకులు కొట్టాలికదోయ్! వాళ్ళ గోడ కదా!.." అన్నారు. "ఆ మేకులేవో నా పెదాలకి కొట్టేయండి. నా చిరకాల వాంఛ నాలోనే వుండిపోతుంది" నా గొంతులో జీర!

"సామాను సర్దటంలో సాయం చేయచ్చు కదా" శాంతంగా అడిగారాయన. "ఎన్ని లారీల సామానుందో

సర్దటానికి?" గొణుక్కుంటూ రంగంలోకి దిగాను.

గుడ్డిలో మెల్లన్నట్టు, పిల్లల్ని టూర్‌కి పంపుతారు, పిక్నిక్‌లకు పంపుతారు. మంచి సినిమాలు, జూ పార్కులు, వాళ్ళతో పాటు తోకని నన్నూ తిప్పుతారు. అంతేగానీ ప్రత్యేకించి 'నీకేమన్నా కావాలా? ఎక్కడికన్నా వెళ్ళాలని వుందా" అని ఒక్కరోజు కూడా అడిగిన పాపాన పోలేదు. ఏమిటో ఈ బ్రతుకు!..

పిల్లలు కాలేజీకి వచ్చాక, రైల్వే స్టేషన్, హాస్పిటల్, కాలేజ్, బస్టాండ్ అన్నిటికీ కొంచెం దగ్గరలో ఒక స్థలం తీసుకుని మూడు గదులు వేశారు. రేకుల కప్పు! ఇంట్లో తనవంతు పనిచేస్తూ కొత్త ఇల్లు కట్టించడంలో అంతా చూసుకుంటూ చాలా కష్టపడ్డారు. బయట కాలేజ్ పని! సుఖపడే యోగం లేదు మరి!.. కానీ నన్ను కూడా సుఖపడనివ్వటంలేదే!

ఇంటి చుట్టూ వున్న ఖాళీ జాగాలో ఒక మామిడి చెట్టు, రెండు కొబ్బరి చెట్లు, పూల మొక్కలు, కాయగూరల మొక్కలు వేశారు. వరి, పప్పుధాన్యాలు పండించటం ఒకటే తక్కువ.

ముంగిట పూడ్చి ముత్యాల ముగ్గులు నేను పెడితే, ఆయన మొక్కలకి నీరు పెట్టేవారు. ఇంట్లో వూడవటం, కడగటం పిల్ల పని. బూజులు దులిపి, సామాను శుభ్రంగా వుంచటం అబ్బాయి పని. మాకు పుట్టటం వాళ్ళ దురదృష్టం! వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటున్నారులే అనుకుంటే ఈ పనులు కూడా. వాళ్ళ చిన్నప్పుడు వాళ్ళ పనులన్నీ ఆయన చేసేవారు. ఇప్పుడేమో వాళ్ళ చేత పెద్ద పెద్ద పనులు చేయిస్తున్నారు. ఆయన గిన్నెలు తోమితే, నేను వంట చేస్తాను. మా ఇద్దరి బట్టలు నేను ఉతుకుతాను. బజారు పనులు ఎవరికి కుదిరితే వాళ్ళు చేస్తాము. అంతా చూస్తే నేను చేసే పనే ఎక్కువ! కానీ దానికి ప్రతిఫలం, గుర్తింపు ఎక్కడ?

తోటలో పువ్వులు దేవునికి, నాకు, అమ్మాయికి. కాయగూరలు అందరం తింటాము. కొబ్బరి బోండాలు, నాకు ఏదో రుచి చూపించి, పిల్లలకి కొన్ని వుంచి మిగిలినవి అమ్మేస్తారు అసహ్యంగా. తాను రుచి చూడరు. మా చెట్టు మామిడికాయలతోనే ఆవకాయ, మాగాయ పెట్టాలి. ముక్కలు తను కొట్టి తుడిచి ఇస్తారు. ఇంట్లోనే ఆవపిండి, కారం, ఉప్పు తయారు చేయాలి. ఇంకా నయం నూనె కూడా గానుగ పట్టమనలేదు.. పీనాసి!...

అసలు ఆ మాగాయ ముక్కల్తోపాటు నేనూ ఎండిపోతే హాయి. నా కోరిక కూడా ఎండిపోతుంది. ఎవరికీ ఏ గొడవా వుండదు.

కాలేజీకి వచ్చారని పిల్లలకి మంచి మంచి బట్టలు, స్కూటరు కొన్నారు. పిల్లల బాధ్యతలు అయిపోతున్నా నా గతి ఇంతేనా?... పిల్లిని గదిలో పెట్టి కొడుతున్నారు.. కానీయండి. ఎదురు తిరిగితే ఎలా వుంటుందో చూపిస్తాను.

"అసలూ పిల్లలకి అన్నీ అమరుస్తున్నారు. తండ్రిగా మీ బాధ్యత బాగానే నిర్వహిస్తున్నారు. బాగుంది. కానీ ఆ పిల్లలు మీకు రావటానికి కారకురాలైన నన్ను వదిలేశారు. భర్తగా నాకేం చేశారు మీరు?" ఒకరోజు ఆయన్ని నిలదీశాను. "పిల్లలు కలగటానికి కారకుణ్ణి నేను కదుటోయ్" అన్నారు చిలిపిగా. "ఛీ ఛీ. నేనీ ఇంట్లో ఒక బానిసని. జీవచ్ఛవాన్ని. పిచ్చిదాన్ని." నా గొంతు పూడుకుపోయింది.

ఆయన నా దగ్గరగా వచ్చి నా తల నిమిరారు. "ఇన్నాళ్ళూ అంత నిబ్బరంగా వున్నావు. తీరా బాధ్యతలు అయిపోవస్తుంటే ఇప్పుడిదేమిటి?.. చూడూ! ఎట్టి పరిస్థితుల్లోనూ మనిషి, తన మనస్సుని, ఎదుటి వాని మనస్సుని కష్టపెట్టకూడదు. ఆలోచనలు వెనక్కు వెళ్ళకూడదు, ముందుకి దూకనూ కూడదు. ఎప్పుడూ ప్రస్తుతంలోనే వుండాలి" అన్నారు గోముగా. సీరంగ నీతులు బాగానే వుంటాయి. "మనం కొన్నాళ్ళు తీర్థ యాత్రలు చేసివద్దామోయ్!.. సెలవులు చాలా వున్నాయి." "కలా... నిజమా!..."

భుజం మీద మెల్లగా చెయ్యి పడటంతో ప్రస్తుతంలోకి వచ్చేశాను. "ఏమిటి ఎక్కడ వున్నావు? ఏమిటా పరాకు?.. పిల్లల గురించి దిగులు పడుతున్నావా? వాళ్ళు వెళ్ళిపోయాక తీరిక ఎక్కువై ఆలోచనలు చోటుచేసుకుంటున్నట్టున్నాయి." చిలిపిగా అడుగుతున్న ఆయన్ని దులపరించుకున్నాను. అంటే ఈ వయస్సులో కూడా కష్ట పడాలా? కాస్సేపు విశ్రాంతిగా కూర్చుంటే, పడుకుంటే చూడలేరా?.. శాడిస్ట్...!

ఇంక లాభంలేదు. ఇంట్లోంచి పారిపోవటమో, ఆత్మహత్య చేసుకోవటమో, ఏదో చేసేయాలి. తప్పదు. అప్పుడే నా విలువ ఆయనకి తెలుస్తుంది.

కొంచెంసేపయ్యాక ఆయన నా పక్కన కూర్చుని "మనల్ని అర్థం చేసుకుని నడుచుకునే పిల్లలు వుండటం, అన్నీ సవ్యంగా జరుగుతుండటం, ముఖ్యంగా అందరం ఆరోగ్యంగా వుండటం అనేది మన అదృష్టం. అబ్బాయికి మంచి కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. పిల్లలిద్దరికీ మంచి సంబంధాలు వచ్చి ఏ ఆటంకాలూ లేకుండా పెళ్ళిళ్ళయ్యాయి. అమ్మాయికి వూళ్ళో సంబంధం! నీక్కావల్సినపుడల్లా పిల్లని చూసుకోవచ్చు. అబ్బాయిని కంపెనీ వాళ్ళు అమెరికా పంపించారు. ప్రాజెక్టు అయిపోగానే వచ్చేసి మన దగ్గరే వుంటానన్నాడు కదా! మన కోడలు, అల్లుడు కూడా చాలా మంచివాళ్ళు. వియ్యాలవారు స్నేహస్వభావులు. ఇంతకంటే మనకింకేం కావాలి చెప్పు?. మా వారు చెపుతున్నది వినకుండా "చివరికి నా కోరిక అబ్బాయి తీరుస్తాడు లెండి. పోనీ మంచివాడు గదా అల్లుణ్ణి అడగమంటారా? అబ్బాయి వచ్చేంత వరకూ నా ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోవని గ్యారంటీ ఏమిటి?.. ఇదిగో చూడండీ! నేను పైకి వెళ్ళిపోయినా, నా ఆత్మ మీ చేత ఆ లక్ష్మి దుద్దులు కొనిపించి తీరుతుంది" గట్టిగా అన్నాను.

నాలో నేనే ఏడ్చుకుంటూ పడుకుండిపోయాను. ఎప్పుడు నిద్రపట్టేసిందో! దేవుని గంట మోతకి మెలకువ వచ్చింది, ఇంత ఆలస్యంగా లేవటం జీవితంలో ఇదే మొదటిసారి.

ఎదురుగా మా వారు! దేవుని హారతి నాకు అద్ది, నా నుదుటిని తన పెదవులతో సున్నితంగా తాకారు. "హాపీ బర్త్‌డే" అంటూ నా చేతిలో గిఫ్ట్ పేపరులో కట్టిన చిన్న పెట్టె పెట్టారు. ఒక కవరు కూడా పెట్టారు. పెట్టె విప్పుతీయి అన్నట్టు చూశారు. విప్పి చూశాను. "లక్ష్మీ దుద్దులు!"... ధగ ధగా మెరిసిపోతున్నాయి.

"దేవునికి దీపం పెట్టి పాలు పంచదార నివేదన చేశాను. త్వరగా స్నానంచేసిరా. తీర్థం తీసుకుందువు గాని" అన్నారాయన ఆప్యాయంగా.

నా చేతిలోని కవరు విప్పి లోపలి కాగితం చూశాను. "నా పేర పదిలక్షలకి ఫిక్స్‌డ్ డిపాజిట్"! ఆశ్చర్యానందాలతో ఆయనవైపు చూశాను. "నా పేర ఏమీ లేదని చూస్తున్నావా?... ఇన్నేళ్ళు నా కష్టంలో, సుఖంలో నన్ను గౌరవించి, చేదోడు వాదోడుగా వున్న నువ్వే నాదానివైనపుడు నాకా డబ్బు ఎందుకు చెప్పు?.. చూడూ! ఈ స్థిరాస్తి, చరాస్తి నీ తర్వాతనే పిల్లలకి చెందుతాయి. ఒక వేళ నీ కంటె నేను ముందు పోతే నువ్వెవరినీ దేనికీ చేయిచాచి ఏదీ అడగక్కరలేదు... చూడూ! త్వరగా లేచి స్నానం చేసిరా. రాత్రి పన్నెండింటికి అంతా ఫోన్లు చేశారు. శారీరకంగా, మానసికంగా అలసిపోయి వున్నాయి. హాయిగా ఆదమరచి నిద్రపోతూ విశ్రాంతి తీసుకుంటున్నావు. అందుకే నిన్ను లేపలేదు. మనవాళ్ళు మళ్ళీ ఫోన్లు చేస్తారు. ముందు గుడికి వెళ్దాము. అమ్మాయి, అల్లుడు, వియ్యాలవారు అక్కడికి వచ్చే ఏర్పాటు చేశాను. తర్వాత అందరూ కలిసి హోటల్‌కి భోజనానికి వెళ్దాము. ఆ తర్వాత సినిమాకి వెళ్దాము. సాయంత్రం పార్కుకి వెళ్ళి చల్లగాలిలో మనసుకి శాంతిగా, హాయిగా గడుపుదాము." ఏమిటేమిటో చెప్పుకుపోతున్న ఆయన్ని అమాంతం కౌగలించేసుకున్నాను నా అంతట నేను మొదటిసారిగా. మా మధ్యన చోటుచేసుకోవాలని పంచ భూతాలూ విఫల ప్రయత్నం చేశాయి. ■


## 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

| | |
|---|---|
| పత్రిక విడిప్రతి | : 5/- |
| ప్రత్యేక సంచిక (దీపావళి) | : 10/- |
| సాలుసరి చందా | : 60/- |

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట మనియార్డరు చేయండి! చెక్కులు, డిడిల రూపంలో వద్దు. ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**

ప్లాట్ నెం.103, రోడ్ నెం.71,
నవనిర్మాణ్ నగర్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-500 033

**గమనిక:** చందాలు పంపేటపుడు పత్రిక పంపవలసిన చిరునామాను మనియార్డరు ఫారమ్‌లో దిగువ కేటాయించిన స్థలంలో విడిగా రాయాలి. పేరు, ఊరు తదితర వివరాలు స్పెల్లింగ్ స్పష్టంగా వుండాలి.